# నా రెండవ భార్య

— శ్రీ న్యా. లక్ష్మణప్ప —

ప్రతిమనుష్యుని బీరువాలోను ఒక అస్థిపంజరము దాగియే యుండును అని ఇంగ్లీషులో సామెత ఒకటి కలదు. అట్లే యెంత ప్రవరాఖ్యు డని పేరందిన వ్యక్తిజీవితము నందును పరామర్శించి చూచినట్లయితే ఏదో దాగియుండిన గుట్టొక్కటి బయలుపడగలదు. కాబట్టి నా రెండవభార్యను గూర్చి నేను మీతో చెప్పుకొనుటకు సంకోచపడవలసిన అవసరము లేదు.

ఆమెసందర్శనము నాకు మొట్టమొదట ౧౯౪౪ నవంబరులో బస్సులో సమకూడినది. ఆ రోజు కొంచెము వర్షము కురిసినది. ఇంకను సన్నతూర పడుచునేఉండినది. సాయంత్రము అయిదుకొట్టినతరువాత ఆఫీసునుంచి బయలు దేరినాము - నేనున్ను. నాతోడిఉద్యోగస్థులు కొందరున్ను. ఇంటికి పోవుటకు. రోడ్లన్నియు వర్షమువలన బురదమయమై నడవడమునకు యోగ్యముకాకపోయినవి. ఆగర్భశ్రీమంతుడనై పుట్టియుండిననో, లేక విస్తారము జీతము గల పనిలేని పెద్దయుద్యోగము నేయుచుండిననో ఆఫీసుపెట్టె నెత్తుకొని ముందర జవాను నడచుచుండగా బూడ్సుల టక్‌టక్‌శబ్ద మాఫీసువరాండాలలో మారుమ్రోగుచుండ మెల్లమెల్లగ నడచివచ్చి షాఫరు తలుపు తీయ నిలిచియుండు బండినెక్కి ఇంటికిపోయియుండువాడను. అట్టి నోము నోచియుండక పోవుటచేత నా ద్విపాదశకటమును స్వయముగ నడపుకొని పోవలసివచ్చెను. విక్టోరియాహాస్టలురోడ్డు కునితిరిగేవఱకు వీటి తాత సొత్తంతయు కంపులువెదచల్లే బక్కింఘాంకాలువలోని దుర్గంధపు నీటిలో మునిగిపోవుచున్నదని యేమూల నుంచియో అకస్మాత్తుగ మీదబడినవి ఉసిరికకాయలంత వానచినుకులు. కట్టుకొనియుండిన గుడ్డలన్నియు తడిసి ఖరాబైనవి. ఈ యవస్థయందు మేము నిమగ్నులమైయుండగా వినబడినది వెనుకప్రక్కనుండి 'బొఇంయ్, బొఇంయ్' అను మోటారుకారుగర్జన. అబ్బ! ఈ మోటారుకారుల కేమి పొగరండి! ఈ చెన్నపట్టములోని రోడ్లన్ని తమ పిత్రార్జితము లనియు. వానిమీద రాకపోకలు సాగించుటకు తమకుదక్క అన్యులకు హక్కు లేదనియు వీని అభిప్రాయము. కాలినడక వారిని చూచిన వీనికి అలక్ష్యమును, చెల్లాటమును! కారుగారు వచ్చుచున్నా రని తెలుసుకొని భయభక్తులతో ఒకమూలకు ఒదిగితిమా సరేసరి; అట్లుగాక మర్యాదకు భంగముగా రోడ్డువెంబడే నడచుచుంటిమా, కోపోన్మత్తుడైన రెడ్డి బక్కచిక్కిన రైతుపై బడినట్లు, మీదబడి యొడలెల్ల నజ్జునజ్జుగావించి రోడ్డునందు రక్తప్రవాహమును బఱపి ప్రాణము నెడబాపును. ఖులాసా హెచ్చినప్పుడు, ఒకయోర కొదిగి నడచుచుండినను రస్తాపైని చలపలయందలి బురదనీటిని పైజల్లి,పరిహాసముజేసి నవ్వునట్లు కూతలువేయుచు బోవును. ఆ రోజు ఆ వెనుక వచ్చుచుండిన మోటార్కారు రోడ్డు కట్టుబాట్ల ననుసరించియే మేము నడచుచుండినను మా యెడ నక్రమముగ ప్రవర్తించిన కారణమున దాని దౌర్జన్యవిషయమై మీతో మొరపెట్టుకొనవలసివచ్చినది.

ఈ స్థితిలో బస్సుదగ్గరకు వచ్చిచేరినాము. నాతోగూడ వచ్చిన ఆఫీసుస్నేహితులు ఎవ్వరిదారిని వారు పోయిరి. నా యిల్లు పాతమాంబళంలో ఉన్నది. బస్సు అప్పటికే నిండి పోయియుండినది; కూర్చొనుటకు తావు లేనేలేదుసరికదా, నిలుచుకొనుటకుగూడ వీలుపడనట్లు తోచినది. ఎట్లో సందు చేసుకొని,"ఎడమిల్లేసార్ ఏరాదుంగో సార్" అని కండక్టరు ఆక్రందించుచుండినను జొరబడి హాంగరును పట్టుకొని నిలబడినాను.బస్సు కదలినది, ఎడమచేతియందు ఆఫీసుఫైలొకటి యుండుటచేత ఒకకుడిచేతితోనే హాంగరును పట్టుకొని నిలువవలసివచ్చినది. అది సామాన్యమైన విషయమని తలతురేమో. అది అరువదినాలుగవ విద్య! చెన్నపట్టణముబస్సులలో తరచుగ ప్రయాణముచేసి సాధనచేసినవారికే యది సిద్ధించును. బయటివారి కది యలవడదు. బస్సుడ్రైవరుకు షోకు పుట్టి ప్రయాణీకులకు దన నేర్పు చూపుటకై యకస్మాత్తుగ బ్రేకువేసినప్పుడుగాని, మూలతిరుగుడులయందుగాని హాం

గరుల నూతగొని నిలుచుకొనియుండు ప్రయాణీకులు భరత నాట్యమున దమ ప్రావీణ్యమును జూపవలసియుండును: రాయపేట పోలీసుస్టేషనుకు వచ్చి చేరగనే యొక ముసలా యన దిగిపోగా ఆయనతావులో కూర్చుండినాను. మరల బస్సు బయలుదేరినది. ఇంతలో బస్సులో నొక కలకలము పుట్టినది. దాని కారణ మిది: ఒక యౌవని యచట బస్సెక్కినది. కూర్చొనుటకు స్థలమెచ్చటను లేదు. హాంగరులను బట్టికొని నిర్ణీతసంఖ్యకంటె నెక్కుడుమంది నిలుచుకొని యుండిరి. బస్సు నాల్గుమూలలకును ఆమె దృష్టులు బఱపినది. కూర్చునియుండిన మగవారెవ్వరైనను లేచి తన్ను మర్యాద జేసి కూర్చుండబెట్టుదురని తలచినదేమో. ఎవ్వరును ఇంకను కదలలేదు. ఇంతలోనే యొక యరవబ్రాహ్మణేతరయువకుడు తనతో గూడ వచ్చుచుండిన మిత్రునితో "ఇంద పాపార్ సోదాపయ్యంగొ. లేడీసు వందు నిన్నుఇరుందాలుం గూడా యెడం కుడుకమాటాంగొ. నాం యెందు నిన్ను ఇం దమ్మాకు ఎడం విడలాం" (ఈబాపనవాండ్లు సోదాకుఱ్ఱవాండ్లు లేడీసు వచ్చి నిలుచుకొనియున్నను లేచి చోటివ్వరు. మనం లేచి నిలచుకొని ఈ యమ్మకు చోటువిడుతాము) అని చెప్పి మిత్రునితోగూడ లేచి నిలచుకొనెను-ఆయువతియు గూర్చొనెను, కాని విషయ మంతటితో ముగియలేదు. నాప్రక్క కూర్చుండియుండిన పెద్ద నామాల అయ్యంగారు ఆ బ్రాహ్మణేతరయువకు డాడిన నిందావాక్యములు తన్నుద్దేశించి పలికినవే యని నిశ్చయించి యతనితో తర్కముసేయ నారంభించెను. దానికి బదు లతడు బ్రాహ్మణ జాతిహైన్యమునుగూర్చియు, బ్రాహ్మణుల దౌష్ట్యమును గూర్చియు, పెరియారుమొదలు చిన్నారువరకు గల బ్రాహ్మణేతరనాయకుల సూక్తిరత్నముల నుదాహరించుచు నొక చక్కని యుపన్యాసమును దొరలించెను, అతని వాగ్ధాటిని బట్టి చూడగా నది యతనికి గంఠస్థమైనట్లు తోచెను. అతనిని మందలించుటకు పలువురు ప్రయత్నపడిరి. బస్సులో కళవళ మతిశయించెనుగాని లాభము గలుగదాయెను, ఇంతవఱకు ఆవాగ్యుద్ధమున పాలుగొనక మిన్నకుండిన యొక ముసలామె-జాతిచే నాదిద్రావిడకులమునకు జెందినది-కదనరంగమును బ్రవేశించి, బస్సులోని ప్రయాణీకులకందఱికిని జవాబుజెప్పుచుండిన బ్రాహ్మణేతర యువకునిని ఆటంబాంబుకంటె తీక్ష్ణతరమైన యొక ప్రశ్నచే నిరుత్తరుని గావించి నోరుమూయించినది. ఆ ప్రశ్న ఇది: "ఎన్నాతంబి! నీ కుత్తం శొల్రదు? పొంబళ్ వందు బస్సుయేరి నిన్నా పాపార్ అవంగళకు తాంగళ్ వుక్కొందు ఇరున్ద ఎడం గాలీసెయిదు కుడుకల్లే అన్ను దానే? నీ శొల్ర పేశు సరితాన్, ఆనా పొంగళుం పెరీవాళుం యెల్లారుం పొంబళ్దానే. నాన్ జాంబజారుకిట్ట బస్సు ఏరినేన్. అదుమొదలు ఇదివరక్కుం తళ్లాదుకళవి నాన్ ఇంద తోల్పట్టయే పుడిచ్చికొండు వాం మున్నెయే తొంగికొండు ఇరిక్కేన్. పొంబళకు మర్యాద కాట్టణుం యెన్ను శంగైపుడిక్కిర నీయ్ యెన్నె కండవుడనే నిన్ను ఎనక్కేన్ ఉక్కోఱ్ఱతక్కు ఎడం విడలే? అళగా చీరై కట్టికొండు కాదులె సల్లైడైకళ తొంగవుట్టుకొండు పాది పిన్నెలెకై నాలె మురిక్కికొండు అనావస్యమా పల్లెకాట్ర చిఱువయసుపొంబళుమాత్రం పొంబళన్ను ఒన్నొడినెనెవా?" (ఏమి తమ్ముడా! నీవు తప్పుపట్టునది? స్త్రీలు వచ్చి బస్సుయెక్కినిలుచుకొనినను బాపలు వారికి తాము కూర్చునియుండిన తావును ఖలీచేసి వారికి యివ్వలేదనికదా, నీవు చెప్పుమాట సరియైనదే. అయితే యౌవనవంతులును ముసలివాండ్రును అందఱు స్త్రీలేకదా. నేను జాంబజారు దగ్గిర బస్సు యెక్కినాను; అప్పటినుండి ఇప్పటి దాక లేవలేని ముసలిదానను నేను ఈ తోలుపట్టను పట్టుకొని నీముందుగనే వేలాడుచున్నాను-స్త్రీలకు మర్యాద చేయలేదని జగడము వేయుచుండు నీవు, నన్ను చూచినంతటనే లేచి నిలచి నాకు కూర్చొనుట కేల తావియ్యలేదు! సొంపుగా చీర కట్టుకొని, జల్లెడలను రెంటిని చెవుల కంటించుకొని, సగము జడను చేతితో మెలివేయుచు, అనావశ్యముగ పండ్లిగిలించు చిన్నవయస్సు పడుచులుమాత్రమే స్త్రీలని నీతలంపా) యని యడిగినది, ఆబ్రాహ్మణేతరయువకుడు జవాబేమియు తోచక గుటకలు మ్రింగ నారంభించెను. బస్సులోనివారందఱును నేకీభవించి యతని పరిభవమున కానందించి గొల్లున నవ్విరి. అటుతరువాత బస్సులో నుండుట కతనికి కష్టమాయెను. ఇంతటనే బస్సు సఱాథియేటరుదగ్గర నాగినది. అతడు మిత్రునితోగూడ దిగిపోయెను; అతని ననుకరించి యా యాదిద్రావిడవృద్ధసతియు లేచిపోయినది,

ఇంత యడావుడికి కారణభూతురాలైన యా యౌవనవతి యెవ్వరని తలచుచున్నారు? ఆమెయే నా రెండవభార్య. ఇదియే మా ప్రథమసందర్శనమని ఇంతకుముందే చెప్పియున్నాను. ఆమెను చూడగనే నామనస్సున వైరస్యము పొడమినది. దీనికి గారణ మామె సౌందర్యవతి కాక పోవుటచేత గాదు, అన్ని యంశములను పరిశీలించి చక్కగా పరామర్శించి చూచిన ఆమె అందకత్తె యనియే చెప్పవలసివచ్చును. ఐదుఐమున్నర అడుగుల పొడవైన శరీరము-పండిన నిమ్మపండును స్మరణకుదెచ్చు దేహచ్ఛాయ-బక్కపలచని మనిషి. సృష్టిచేయునపుడు తనయొద్ద నున్న సామగ్రియంతయు ఖర్చయి యే కొంచెమో మిగిలియు

డగా దినసరి కార్యమును ఎట్లో నెరవేర్చినానని చెప్పుటకు బ్రహ్మదేవు డామెయస్థిపంజరముమీద చర్మమును పలచగ పూసినట్లు తోచినది, కాని యామెవైశిష్ట్యత కన్నులయందు గానవచ్చును. విశాలములైన ఆమెతెలిసోగకన్నులనుండి నైజముగ వెలువడు శోభ చంద్రిక నభస్థలమునువలె వెలుగొందజేయుచున్నది. ఆమె సుందరియైనను నా కామె యెడ వైగస్యము గలుగుటకు కారణము లేకపోలేదు. బస్సుప్రయాణము చేసే స్త్రీలయందు సామాన్యముగా కనబడు దుర్గుణ మొకటి. బస్సులు ఉదయం ౬ గంటలమొదలు రాత్రి ౯ గంటలవరకు పోవుచునే యుండునుగదా, ఈ మధ్యకాలములో వీ రెప్పుడు సాగించుకోగూడదు ? త్యాజ్యము, వారశూల, రాహుకాలము అంతా చూచుకొని ముస్తీబుచేసుకొని బయలుదేరడానికి. 'కాలే కడుపుకు మండే గంజి'యన్నట్లు ఉడికెడిమెతుకు నోట అవసర అవసరముగా క్రుక్కుకొని మొగవాం డ్రాఫీసులకు వెళ్లే సమయమునకో, లేకపోయిన దినమంతయు నాఫీసులలో నరకచాకిరీ చేసి ఇంటికి తిరిగిపోవుసమయమునకో కాని వీరికి పయణము నేయుటకు చక్కని సుముహూర్తము కుదురదు. పయణమైవచ్చువారు ఊరక రారు. ఇంట్లో వుండే పాత నూనెడబ్బాలు, చింపిరిగోనెసంచులు, ఓటిచెంబులు, తపేలాలు, వేణ్ణీళ్ల హండాలు మొదలైనవాని నన్నిటిని కూడ వేసుకొని, యీ సరంజామంతయు చాలనట్లు, చెవులు తూట్లు పడునట్లు గింగురుమని యేడ్చెడు ముక్కుచీమిడి పిల్లకాయల నొకరిద్దరిని జాగ్రత్తపెట్టుకొని బస్సారోహణకై వచ్చి చేరుదురు. వీరికి బస్సులో చోటియ్యకపోయినట్లాయెనా, కండక్టరుయొక్క గుణవిశేషములను, వాని పెద్దల నడవడిక తీరును మార్గమున పోవువారి కందఱకు విశదమగునట్లు ప్రకటింతురు. బస్సులోని కెక్కిరా, అంతకుపూర్వ మందుండు మగవారి యవస్థ చెప్పవలసినది లేదు. ఎంత యలసి కూర్చునియుండు మగవాడుకూడ వీరికి అర్ఘ్యపాద్యముల నిచ్చి 'ఆసనం సమర్పయామి' అని లేచి చెప్పి మ్రొక్కుకొనవలయునట ! అట్లు చేయక ప్రాలుమాలితిమేని ఏ బ్రాహ్మణేతరకుఱ్ఱవాడో 'పాపార్ పైల్ సోదావయ్యంగో' అని నిందించును. ఈ వింతపరిస్థితికే మగవాని యొడలు రగులుకొనిపోవును. మఱియొక కారణ మామెకృతఘ్నత. ఆ బ్రాహ్మణేతరకుఱ్ఱవాడు ఈమెకు గూర్చొనుటకు దన తావిచ్చి,—వాని వాక్పారుష్యమువల్లనే యనుకొందము—నలుగురి నోట నానెనుకదా! వాని పక్ష మవలంబించి వానికి ఒత్తాసిగ ఒకమాటయైన చెప్పలేదు. అది యట్లుండనిండు. ఆ యాదిద్రావిడవృద్ధాంగనవల్ల నాతడు పరాభూతుడు కాగా నాతని జూచి యందరిని గూడి ఈమెయు నవ్వినది. ఇంతకు మించిన కృతఘ్నత వేరేమి కలదు ? నా మనస్సున నిట్లామె యెడ వైరస్యము గలిగినను అంతర్బుద్ధియందుమాత్ర మానందము బుగ్గటిల్లుచునేయుండినది. కారణము సువ్యక్తము గాకపోయినను, ఆమెయెడ నాయెదయం దే మారుమూలనో యనురాగలేశము పొడమినట్లు తలచవలసియున్నది.

*   *   *

తరువాత నా రెండవభార్య సమ్మేళనమప్పుడప్పుడు బస్సునందే తటస్థపడుచువచ్చినది. ఆమె యెవ్వరో నాకు తెలియకపోయినను 'రాణిగారితో నా వివాహము నిశ్చయమైన' దను న్యాయము ననుసరించి మాకు సఖ్యము కుదిరినది. ఇతర స్త్రీలు బస్సెక్కినప్పుడు వారిని శపించు నా మనసు రాయపేట పోలీసుస్టేషనును బస్సు సమీపించునప్పటి కామెరాకకనుదినము నిరీక్షింపసాగినది. ఇది నా మనస్సునకు తగని పని. నేను స్త్రీమొహ మెఱుగని యువకుడను గాను; గృహస్థుడను, కుటుంబవంతుడను. ఇంగ్లీషు చదువు కొనినవారంగటివలె స్నానసంధ్యాదులను విసర్జించి మన కులధర్మాదులను 'సూపరిస్టిషన్'అని నేనును ఒకప్పుడు నిరసించుచుంటిని, కాని యా నవీనాభిప్రాయము లన్నియు నెట్లో ఇటీవల మాయమైపోయినవి. ప్రాతమార్గముననే మరల పడి నిత్యమును స్నానము, సంధ్య, జపము, ఏదో కొంచెము రామాయణము, గీత మొదలగు మతగ్రంథపారాయణము కుదిరినవి. ఆఫీసులోనేమి, నా యిరుగుపొరుగున నేమి 'పెద్దమనిషి' యని నలుగురిచేతను అనిపించుకొన్నాను. నాకు పరువుమీద ఆదరము బలిష్ఠము. ఇటువంటి వాడనగు నా మనస్సు ఎవ్వతెయోయొకతె—అనుదినము నాతోగూడ బస్సుపయణము సాగించునదియే యనుకొనుడు. ఎఱ్ఱగా పుల్లగా కన్నులపండువైనదే యనుకొనుడు—దానియెడ నా యంతస్తునకు తగినట్లుగాక విరుద్ధపుపోకడలు బోవడ మెంతయు శోచనీయము, ఈ విషయమై నా మనస్సునకును, నాకును ఎన్నియో వాగ్యుద్ధములు నడచినవి. ఎంత సహేతుకముగ దాని చర్య నింద్యార్హమని నిరూపించి ఖండించినను, అది కొంద ఱాధునిక యువతీయువజనముల పద్ధతి ననుసరించి, ఫ్రీలవ్ను ప్రతిపాదించుచు యధేష్టముగ ప్రవర్తింపదొడగుటచే బలుమారు నాకే యపజయము గలుగుచు వచ్చినది. మా యిరువురి మధ్య గలిగిన ఈ వివాద మింకను తీర్మానముగాలేదు. ఇంతలోనే గోరుచుట్టుపై రోకటిపోటువలె నొక పెనువిపత్తు వచ్చి పైబడినది.

దక్షిణభారతహిందీ ప్రచారసంఘమువారు గంధితిరునాళ్లను చాటించిరి. సత్యనారాయణగారు ధ్వజారోహణము గావించి బ్రహ్మోత్సవమును కొట్టికోలాహలముగ చేయుటకు చరామనీగ పనులు సాగించనారంభించిరి. కాలానుగుణ్యముగ నొక్కొక్క స్థలమునకు శుక్రదశ పట్టుచుండును. మాంబళంచంతు ౧౯౪౫ డిసంబరులో వచ్చినది. సంతతనిద్రాపారవశ్యులైయుండు మదరాసుకార్పొరేషన్ వారికి అశ్రుతపూర్వమైన ప్రబోధము గలిగినది; ఎప్పుడును కంకర మొహ మెఱుగని రోడ్లు, వీథులు, గొందులు అన్నియు కంకరచే చదనయి, తారు బూయించుకొని నదమంత్రపుసిరిచే మిట్టిపడు నాగరాంగనలవలె నిక్కసాగినవి. ఎన్నడు దర్శనమీయని కార్పొరేషన్ ఆరోగ్యశాఖాధికారులు లేనిపోని శ్రద్ధ వహించి, మహాపరిశుద్ధిగ పెంటయూడ్చు క్రొత్తచీపురుకట్టవలె, పెంటయున్న చోట్లకంటె లేనితావులయందు కడు పట్టుదలతో చిమ్మసాగిరి. దోమపాశెములను ధ్వంసము చేయుటకు దోమప్రపంచకాలరుద్రుడు మాసిలోమణిమొదలియా రను దళవాయి దండును గూర్చి దుర్గంధతైలబక్కెట్లతోడను, వలసంచికట్లలతోడను ఎత్తివచ్చి వీథులవెంబడి నుండు నూతులలోను, పడియలలోను తండ్రితాతముత్తాతలకాలమునుండియు తరతరములుగ గృహారామాదులను నిర్మించుకొనియుండిన మశకప్రజపై హఠాత్తుగ నురవణించి రూపుమాపెను. ఏ రిక్షాస్టాండుచెంతనో సవారికై వేచియుండు రిక్షావాలాలతో లేనిపోని నేరములు గల్పించి యనావశ్యకమైన తర్కములను పెంచి లంచములుగొట్టుచుండు పోలీసుజవానులు సచేతనములై నడయాడు నేప్టీనిప్పుపుల్లలవలె సర్వత్ర సంచరింపదొడగిరి. ఎవ్వరి యొడలిపై జూచినను ఖద్దరుజుబ్బాలే! ఎవ్వరి నెత్తిపై జూచినను గంధీటోపీలే! ఎటు వైపు చెవియొగ్గి వినినను వచ్చీరాని హిందీ పలుకులే! గాంధీగారి మాహాత్మ్యమెట్టిదోకాని మా త్యాగరాయనగరు సూక్ష్మీకృతభారతావనియై పరిణామము నందినది. గుజరాతీలు, మార్వాడీలు, హిందూస్థానీలు, బంగాళీలు, దఖనీలు, తెలుగులు, అరవలు, కన్నడిగలు, కొంకణీలు, మళయాళీలు మొదలైన సకలజాతులవారును ఎచ్చటెచ్చటినుండియో కొట్టుకొనివచ్చి మాంబళంనడివీథులలో తేలిరి. తెల్ల, పుల్ల, నల్ల సిపాయిలకని సర్కారువారు కేటాయించి ముద్రవేసి మీదెత్తియుంచియుండిన బండ్లు పోను తక్కిన బండ్ల పొట్టలు పిక్కటిల్లునట్లు జనము నెక్కించుకొని పొగబండ్లు పెనుపరుగుమీద మద్రాసుకు వచ్చి, భరించజాలక వాంతిజేసుకొనుచుండినవి.

* * * *

గాంధీమహాత్ముని బ్రహ్మోత్సవసందర్భమున నడచిన వేడుకలలో ప్రధానమైనది నిత్యప్రార్థనసమావేశము. అది నా జన్మమున మరవరానిది. ఏలనగా నాకును, నా రెండవ భార్యకును దాంపత్యము కుదిరిన దీప్రార్థనసమావేశములయందే. మొదటి మూడునాల్గురోజులయందు ప్రార్థన హిందీప్రచార, బోగురోడ్డుల మధ్యనుండు నొక మైదానమున జరిగినది. ఈ మైదానమునకు ఉత్తరపు అంచున కట్టబడిన ఒక యున్నతవేదికపై గాంధిగారు వారి పరివారముతోగూడ ప్రతిసాయంత్రము వచ్చి కూర్చొని ప్రార్థనను సాగించెడివారు. మహాత్ముని దర్శనమును గోరి వేలకొలది పామరజను లనుదినమును చుట్టుపట్టుగ్రామాదులనుండి వచ్చి మూగువారు. పండ్రెండుగంటలకే మైదాన మంతయు నిండిపోయెడిది. ఆలస్యముగ వచ్చిన మహాత్ముని దర్శనము ఫర్లాంగుఫర్లాంగున్నరదూరమునుండి చేసుకొనవలసినదే. ధనవంతులు, విద్యావంతులు తమతమ వ్యాపారములను వదలుకొని రాజాలనివారు దూరమునుండియేనియు దర్శనభాగ్యము లభించిన చాలునని బైనాకులసులలో తయారై వచ్చెడివారు.

నాకు కాంగ్రెసుప్రచారములో ఎక్కువ నమ్మకము లేదు: గాంధిగారి సందేశములో ముఖ్యాంశమైన అహింస దేశాభివృద్ధికి తోడ్పడదని నాయభిప్రాయము. హిందూమహమ్మదీయసఖ్యము అసంగతమని నా తలపు. మద్యపాననిషేధము మనదేశమునం దావశ్యకమైన సంస్కారము గాదు. కాని భరతఖండమునం దెల్లయెడలను నపూర్వజాతీయోద్బోధమును గలిగించి యాత్మబలముచే సర్వమానవుల హృదయమును చూఱగొనిన మహనీయుడు భగవత్స్వరూపుడుగాని మానవమాత్రుడు గాడు. ఆయనసందర్శనమాత్రమున కల్మషములను బాసి యాత్మ పరిశుద్ధ మగునని నిశ్చయించి రెండుమూడు పర్యాయములు ప్రార్థనమైదానమునకు బోతిని; కాని బహుదూరమున నాయన యాసీనుడైయుండిన కారణమున మనసునకు తృప్తికలుగలేదు.

* * * *

ఆచార్య మహాదేవనుగారు నా చిరమిత్రులు. మేమిద్దరము మద్రాసుక్రైస్తవకళాశాలలో సహాధ్యాయులము. తరువాత కొన్నియేండ్ల పర్యంతము మే మిద్దరము నచట ఉద్యోగమున నుంటిమి. కాని ఇటీవల నాకు వారితోడి సంసర్గము సన్నగిల్లినది. నేను మదరాసులో, వారు మధురలో. హిందీప్రచారరోడ్డులో వారి స్వగృహము గలదు. దానికి వెనుకనే గాంధిగా రనుదినమును ప్రార్థనసమయమున గొలువుండు వేదిక నిర్మింపబడిన దనియు, మహా

దేవనుగారి మేడపై నెక్కిన గాంధిగారిని సమీపమున నుండి దర్శనముచేసుకొనవచ్చుననియు గర్ణాకర్ణిగ విని యొక సాయంత్ర మటువైపు నడచితిని. వారి వాకిటి మొగాళమున నొక పెద్దగుంపు. స్త్రీలు పురుషులు కలగాపులగముగ గేటుతలుపులను నెట్టుకొని లోపలికి బ్రవేశించ బ్రయత్నపడుచుండిరి. వాకిటి కడ్డముగ తోటవాడు, వానితోగూడ ఒక పెద్దకుక్క ఎవ్వరిని లోనికి బోనీయక అడ్డిపెట్టుచుండిరి. ఎట్లు దారిచేసికొని గేటువాకిటితోటవానిని, కుక్కను సమీపించి వారితో చెప్పుకొనడమా యని యోచనచేస్తూ కొన్నినిమిషము లచట నిలిచితిని. ఇంతలోపల నొక పెద్దమోటారుకారు ఒక అయ్యరువారి కుటుంబముతోసహా వచ్చి గేటును సమీపించినది. దానికి దారి విడుచుటకై యచ్చట మూగియుండిన ప్రజలు రెండుపాయలై వీడి వెనుకకు ఒదిగిరి. ఈ గడబిడలో నే నెట్లో ముందువడితిని. అయ్యరుగారిని ప్రవేశపెట్టుటకు తోటవాడు ప్రయత్నపడుచుండగనే ఇంటిలోపలినుండి వారికి స్వాగతమిచ్చుటకు ఆచార్యమహాదేవనుగారే స్వయముగా వచ్చిరి. వా రింకను మధురయందే యుండిరని తలచితిని. అది పొరపాటు. గాంధిగారిని దర్శించుటకు వారుగూడ మదరాసుకు వచ్చిరట. అయ్యరుగారిని లోపలి కంపినవెంటనే నే నాతని కంటబడితిని. "హల్లో ప్రొఫెసర్, ఇటీస్ ఏజస్ సిన్స్ వుయి మెట్, యు అర్ క్రైవ్వట్ వెల్కమ్, కం అలాంగ్"అనుచు ముందునకువచ్చి నాచేయి బట్టుకొని లోనికి నడువనారంభించిరి. తోటవాడు మరల గేటుమూయుటకు ప్రయత్నించగా, ఆచార్యగారు కోపించుకొని "ఏండా, స్టూపిడ్, ఒనెక్కు మూళైయిల్లియా ? అయ్యావుం అమ్మావుంకూడ వందిర్కిరాఘళ్ - అమ్మా వుళ్లవరత్తుక్కు మున్నెయే ఏన్ గేట్ శాత్తురాయి"అని గర్జించినాడు. తోటవాడు 'ఇల్లేసామి'అని ఇంకయేమో చెప్పబోయి సమాళించుకొని యొకప్రక్క నిలిచెను. నేను ఒంటరిగనే వచ్చితిని గదా, మఱి నాతో వచ్చిన అమ్మ యెవ్వరు అని సందేహపడి వెనుదిరిగి చూచితిని. ఆశ్చర్యముతో నిశ్చలుడనైతిని. నావెన్నంటి ముసిముసినగవులు నగుచు వచ్చుచుండినది నా రెండవభార్య ? ఏమని చెప్పుదును. నాకు మహత్తరమైన కోపము వచ్చినది. ఎంత బిడియము లేని స్త్రీ యామె! తాత్కాలికముగ నభిలషితార్థమును బొందుటకై, ఎవ్వరో పరాయిమగవాని నొక్కని దన భర్తయని ప్రకటించుచుండగా, కాదని చెప్పకపోవుట యటుండనిచ్చి, యంగీకారసూచకమైన చిరునవ్వుతో వెనువెంట దగులుచున్నది. ఆమె ఇల్లాలా ? ఈమె నాభార్య కాదని చెప్పదలచితిని ; కాని మాట నాలుకతుదనే ఆగిపోయినది. నామనస్సులో ఆమెప్రవర్తననుగూర్చి నడచుచుండిన తర్కమును ఆమె గ్రహించినదేమో ఆమెచహర తక్షణమే మారిపోయినది. చిరునవ్వు మాసిపోయినది ; కన్నులలో దొలకాడు తేజస్సు ముఖమున కొక నూతనవికాసమును గలిగించినది. అరుణోదయమప్పటి పూర్వదిశవలె మొగము జేవురించినది. నామనస్థితిని ఆమె గ్రహించి నా యాందోళనను గని నన్ను హేళనచేసి విహసించుచున్నట్లు తోచినది. నాకోపము చల్లారినది.

* * * *

గాంధిగారి దర్శన మైనది. ప్రార్థన, రామ్‌ధున్‌ఉపన్యాసము ముగిసినవి. ఇక మహాదేవనుగారికి కృతజ్ఞతాపూర్వకవందనములను సమర్పించి వీడ్కొని బయలువెడల బ్రయత్నమొనర్చితిని. కాని వారు నా కనుజ్ఞ ఈయక ఆగమని చెప్పి ఇంటిలోగిలివైపు తిరిగి, వారి ధర్మపత్నినుద్దేశించి "ఏండీ! ప్రొఫెసర్ పోరార్ - అందమ్మాకు తాంబూలంకుడుత్తు శుక్కా ముడియ్," అని గొంతెత్తి చెప్పి, నావైపు ముఖమై, "ఐసే, ఓల్డ్‌ఫెల్లో, యు మస్ట్ కం హియర్ ఆఫన్"అని యాహ్వానించినాడు. నేను ఆయనకు జవాబుచెప్పుటకు నోరుతెరచితిని. ఇంతటనే నా రెండవభార్య సతాంబూలనారికేళకరద్వయమై బయల్పడినది. ఆచార్యగారి సతీమణి "అందమ్మావయంగూడ కూపుటువాంగో"అన్నది. అనాలోచితముగ 'సరిదాన్'అని పలికితిని. నాగుండెలలో రాయిపడినట్లయినది. నాకేమి ఇట్టి దుర్బుద్ధి పుట్టినది? ఆమె యెవ్వరో ? మగనాలో కాదో నాకు తెలియదు. పేరు, ఊరు ఎఱుగను, కులము, గోత్రము మాట చెప్పవలయునా ? ఆసంగతి నటుండనిండు. నేను మహాసత్పురుషుడను అనుకొనే నాఇంటావె, చాల పెద్దమనిషి నని తలచు నాబిడ్డలు ఈ విషయమును విన్నచో నేమనుకొనెదరు ? ఇరుగుపొరుగువా రెఱిగిన తలవంపగునుగదా? అని వ్యాకులపడుచు గేటు దాటితిని. ఏమనుకొనిననేమి ? నా రెండవభార్యకును, నాకును వివాహమునకు గంధిగారి పుణ్యమున నిట్లు నిశ్చితార్థమైనది "నొసటన్ వ్రాసిన వ్రాలు దుద్వవశమా నూతేండ్లు చింతించినన్," అన్నాడు ఒక అధునాతనఅజ్ఞాతాంధ్రాభ్యుదయకవిసార్వభౌముడు-ఎంత సత్యము!

* * * *

నిద్ర పట్టలేదు-గాలివీచుట మానివేసినది - ఉక్క- దేహమంతయు చెమరించిపోయినది. సరిగమపదనిసలతోటి దోమల సంగీతము చెవుల గింగురుమని మ్రోగుచున్నది. ఈశ్రమ నెట్లో యోర్చుకొనినను మనోవ్యాకుల మోర్వరాక పోయినది. ఆ నా రెండవభార్య ప్రవర్తన కంటినలుసువలె బాధింపదొడగినది. ఎంతసాహసురాలు! నేనెవ్వరు, తానెవ్వరు? బస్సులో నెందఱు స్త్రీలు ప్రయాణముసేయుట లేదు? అందఱు నీమెవలె ప్రవర్తించిన మగవారి గతి యేమి కావలయును? ఆమెపేరుగూడ నే నెఱుగనుగదా. ఆచార్య మహాదేవ నీమెను నా భార్య యని భ్రమపడి ప్రకటించు చుండ, ఇదమర్థమనక ముసిముసిన వ్వులతో తాంబూలము బుచ్చుకొన్నది. ఎంతటి సాహసురాలు! కాని తప్పంతయు నామెపై మోపుట న్యాయమా? నే నెంతటి పెద్దమనుష్యు డను? పరస్త్రీని ఆచార్యులవారు ప్రమాదవశమున నాకు భార్యయని యంటగట్టుచుండ నేనేల వారికి వాస్తవస్థితిని దెలియజేసియుండకూడదు? మౌన మేల వహించితిని? మౌన మంగీకారసూచనయేకదా! నిజ మాచార్యులవారి కెఱుకపడిన నాచారిత్రమునుగూర్చి వా రేమని తలతురు? నే నొక శుంఠననియేగదా వా రభిప్రాయపడుదురు? ఇంటిలో మాయావిడచెవి సోకిన-భార్యలు గల మహనీయులారా; ఆ యాపద యెంతటి ప్రాణోపద్రవకరమో. మీ కందఱికి స్వానుభవమువలన చక్కగ తెలిసియేయుండునుగావున వివరించివ్రాయ నవశ్యములేదు. ఇంకొక రహస్యము వినండి. ఎప్పుడో జరిగిన సంగతిని మీతో చెప్పుకొనవలయునని కాగితము, కలము చేతబట్టుకొనగా కాగితము తెల్లబోయినది; కలము ముఖముమాడ్చుకొని ధుమధుమలాడుచు నల్లగ వ్రాయదొడగినది. దోమకాట్లవంటి ఈ భావములచే నా యంతరాత్మ బాధపడి బాధపడి యెప్పుడో సొమ్మసిల్లిపోయినది.

*　　　　*　　　　*

సాయంత్రము మూడుఘంటలు కొట్టినవి. కాఫీసమయము. మామూలుప్రకారము మా యింటి పెద్దహాలులో కుంపటి-కుంపటి కొకప్రక్క నేను. నాయెదుట మా యింటాపె. మా కిరుప్రక్కల మా పిల్లకాయలు. పాలు సలసల క్రాగినవి. డికాక్షను. చక్కెర కలిపి యొక టంబ్లరుకాఫీ మా యింటాపె అందిచ్చినది. ఒకగ్రుక్క త్రాగితిని. అప్రయత్నముగ నా మొగము చిట్లించుకొనిపోయినది. అన్నది మా యింటాపె—

"ఏం. ఎట్లావున్నది?"

"బాగానేవున్నది!"

"మొహంచిట్లించారే!"

"చిట్లించానా?"

"ఏమీ యెఱుగరు, పాపము-నిజంగా చెప్పండి. కాఫీ యెట్లా వున్నదో?"

"కాఫీ కాఫీవలెనే వున్నది."

"పెద్దవారవుతున్నప్పటికీ చాత్రీలకు తక్కువలేదు."

"వినలేదా, చెట్టు ముదిరే కొద్దీ చావముదురుతుం టుందని"

"అబ్బా! చెప్పుదురూ. యెట్లా వున్నదో కాఫీ?"

"ఏమీ లేదు. చక్కెర తక్కువ."

"ఈరేషనుకాలంలోగూడ చక్కెరవేసుకోవడం తగ్గించరాదూ?"

ఈ సరససల్లాపములలో నిమగ్నుడనైయుండగా వాకిటితలుపు తెరచిన శబ్దము వినిపించినది. త్రాగుచుండిన కాఫీని అట్లే క్రిందబెట్టి ఎవ్వరో కనుగొనవలెనని ముందటి హాలు లోకి నడచినాను. ఎవ్వరో కాదు. సుబ్బులుశాస్త్రిలు! ఆయనతో గూడ మఱియొక వైదికబ్రాహ్మణుడుకూడ ప్రవేశించినాడు- ఎప్పుడైన మాయింట నేమైన విశేషము జరిగితే శాస్త్రిలువారి యధ్వర్యముక్రిందనే జరిగెడిది. కాబట్టి ఆయనను చూడగనే అడిగితిని—"ఏమండీశాస్త్రిలవారూ తాము విజయంచేయుటకు కారణము?" అని.

"ఏమీ లేదు" అని నవ్వినాడు.

"నవ్వుతున్నారేమి?"

"శుభకార్యంగదా!"

"శుభకార్యమా?"

"పెండ్లికి మీరు సిద్ధంకాండి. అమ్మగారుకూడా వస్తూవున్నారు."

"అమ్మగారు వస్తున్నారా?"

"అవును. వారుగో" అని వాకిటివైపు చూపినాడు.

అటు చూతునుగా, వచ్చుచున్నది బిరబిరమని నా రెండవభార్య. ఆమెను చూడగనే పోయిన ప్రాణము లేచి వచ్చిన ట్లయినది. మనుష్యుని మనస్సు కడువింతయైనది; క్షణక్షణము మారుతూవుంటుంది. గాలితాకునకు తునకలై యనునిమిషమును మాయుచుండు మబ్బుతునకల రూపునకేని నిలకడగలదుగాని, మనస్సున కుండదు. ఇన్నిదినముల నుండియు శ్రీరంగనీతులు దిద్దుతూ వచ్చిన నా మనస్సు ఆమె నన్ను పెండ్లాడుటకై వచ్చినదని వినినంతనే తన పూర్వప్రచారమును విస్మరించినది. ఇంతేకాదు. ఎదుట ఇంకను కాఫీకుంపటిచుట్టు బిచ్చవడియుండు నా భార్యాబిడ్డ

ను చూచియైన జంకక ముందంజ వేసినది. "క్షణక్షణముల్ ముదివారి చిత్తముల్" అని వ్రాసుచ్చిన యాంధ్ర కవితాపితామహుని వాక్యము సత్యము, సత్యము, ముమ్మాటికిని సత్యము. ఈ శాఖాచంక్రమణాన్ని క్షమించండి. జరిగిన సంగతిని జరిగినట్లు దాపరికములేక చెప్పెదను. ఆమెకు నేను ఎదురునడిచితిని. నేను సమీపమునకు వచ్చినంతటనే ఆమె యాగినది. ఒకరివైపు ఒకరు చూచుకొంటిమి. మా కన్నుల దృష్టులు మధ్య కలసి మా హృదయసమ్మేళనమును సూచించినవి. సుబ్బులుశాస్త్రిలును, వైదికబ్రాహ్మణుడును చేరవచ్చి చెరియొకప్రక్క నిలిచిరి. నోరు తెరువలేదు. ఆమె అంతవఱకు ఎక్కడ దాచియుంచినదో ఒక్క రోజా పూలదండ ఎత్తి నా మెడలో వేసినది. ఆమె కన్నులనుండి వెలువడు నుజ్వలదీప్తికిరణములు, కొండచిలువకంటిచూపులు మృగమునువలె నన్ను ప్రజ్ఞాహీనుని గావించినవి. చేతులప్రయత్నముగ నామెవైపునకు చాగి యామెమృదుశరీరము నావరించుకొనిపోయినవి. నోరు ఆమెయెఱ్ఱని పెదవులను, గండస్థలములను, నీలకచములను ముద్దుగొనినది. ఆమెయంగసంస్పర్శనమువలన తన్మయమందినది. 'ఆనందో బ్రహ్మ'యను సూక్తియందలి సత్య మప్పుడు గ్రహించినది. ఆమె మాట్లాడగడగినది—"రాండి, పోదాము" అని. ఆ మాటలు నన్ను స్వర్గమునుండి భూజగమునకు డింపినవి. నిట్టూర్పువిడుచుచు, "ఎచటికి ?" అని యడిగితిని. "మన యింటి" కనినది. ఆమెనోటనుండి యామాట వెలువడినదో లేదో వెనుకకు దిరిగియైన చూడక బయలుదేరితిని. చాల దూరము నడువవలసివచ్చినది. క్రొత్తఇల్లు నుంగంబాకంలో కట్టించుకొన్నదట. అచ్చటనట మా హనిమూను. వర్షము సన్నతూరపడ నారంభించినది. మేమిద్దరము తడువవలసి వచ్చినది. ఆమెముఖముమీద వర్షబిందువులు ముత్యములై మారనారంభించినవి. తడిసిపోవునని వ్యధ. నేను తొడుగుకొనియుండిన చెక్కుకోటును తీసి యామెభుజములపై కప్పి చేతిరుమాలుతో ముఖమున తడి యొత్తజొచ్చితిని. ఎచ్చటినుండి వచ్చిన వబ్బా ఈ నునుప్రేమదొంతరలు !

* * *

ఏదోయొక యానందప్రపంచమున నిర్యాణము నందియున్నాడు. ఇంద్రియాతీతమైనది ఆయవస్థ. సర్వసృష్టియు లయమై నాయాత్మ యొక్కటియే సచ్చిదానందపరబ్రహ్మమునం దైక్యమునందినట్లు తోచినది. కాని దూరమునుండి శ్రావ్యమైన నాద మొక్కటి చెవిసోకినది. మొదట నస్ఫుటమై పూలనడుమ గుసిసియాడు నళిమధురగానమును స్మరణకుదెచ్చినది. క్రమక్రమముగ స్థాయి హెచ్చి యుషఃకాలమునందలి పక్షుల కాకలీధ్వనిగ మారినది. కొంత తడవునకు నది యొక పాటగ పరిణామమునందినది. ఎవ్వరో, ఎక్కడనో—

"నన్నుజూచి నవ్వబోకురో, ఓప్రాణనాథా,
నన్నుజూచి నవ్వబోకురో
నల్లనల్లనిదాన నని నన్ను జూచీ నవ్వాబోకూ
నల్లరేగడు దున్ని చల్లితె తెల్లజొన్నలు పండలేదా."

ఇట్లుండగా, నన్ను ఎవ్వరో తట్టిలేపినట్లయినది. కన్నులు విచ్చి చూచితిని. ఏమి ఆశ్చర్యము! రాత్రి నావద్దనుండిన నా రెండవభార్య యేదీ ? ఎట్లో అంతర్ధానము నందినది. మా పెద్దబ్బాయి "ఏమండీ నాన్నగారూ, ఈవేళ ఇంకా నిద్రబోతున్నారు ? కాఫీ చల్లారిపోతున్నదని అమ్మ కేకలేస్తున్న"దన్నాడు. "ఆ పాడే దెవ్వర్రా ?" అన్నాను. "తాయి నాయనా, కసువూడుస్తున్నది." ఈమాటలు విన్నంతటనే నామనస్సు చివుక్కున్నది. జగత్తు మిథ్య యని వెలవిచ్చిన యాచార్యదేవుల మహావాక్యము పొల్లగునా ?

